వరంగల్, ఖమ్మంలలో ఆర్‌వీ టూర్స్

కర్నూలు, భీమవరం, రాజమండ్రి, ఒంగోలులో కూడా కొత్త శాఖలు

హైదరాబాద్, ఏప్రిల్ 23: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లోని పర్యాటక ప్రియులకు రెండున్నర దశాబ్దాలుగా అతి తక్కువ ధరలకే అత్యుత్తమ సదుపాయాలతో దేశ, విదేశీ యాత్రల సౌకర్యాన్ని అందిస్తున్న ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ లిమిటెడ్.. బుధవారం మరో 6 నగరాల్లో నూతన శాఖలను అందుబాటులోకి తెచ్చింది. వరంగల్, ఖమ్మం, కర్నూలు, భీమవరం, రాజమండ్రి, ఒంగోలులో కొత్త కార్యాలయాలను ప్రారంభించింది. 25 ఏండ్ల క్రితం హైదరాబాద్‌లో మొదలైన ఆర్‌వీ టూర్స్ ప్రస్థానం.. ఆ తర్వాతి రోజుల్లో బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కరీంనగర్‌లకు విస్తరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఇప్పుడు మరికొన్ని నగరాలకు తమ సేవలను తీసుకొచ్చామని, ఈ సదుపాయాన్ని ఆయా నగరాలు, పట్టణాల ప్రజలు వినియోగించుకోవాలని ఓ ప్రకటనలో సంస్థ చైర్మన్ ఆర్‌వీ రమణ్ కోరారు. ఇన్నేండ్లుగా తమకు సహకరిస్తూ, తమ ఉన్నతికి దోహదపడిన ప్రతీ కస్టమర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, కొత్త శాఖల ప్రారంభోత్సవం సందర్భంగా ఆకర్షణీయమైన డిస్కౌంట్లను సంస్థ ప్రకటించింది. ఇందులోభాగంగానే కేవలం రూ.21,999కే కాశీ, అయోధ్య 4 రోజుల విమాన ప్యాకేజీని అందిస్తున్నట్టు రమణ్ చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లగ్జరీ ఐటెమ్స్‌పై 1% టీసీఎస్

రూ.10 లక్షలు కంటే విలువైన హ్యాండ్‌బ్యాగులు, చేతి గడియారాలు, స్పోర్ట్స్‌వేర్ తదితర వస్తూత్పత్తుల కొనుగోళ్లపై వర్తింపు

స్పష్టం చేసిన ఆదాయ పన్ను శాఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: రూ.10 లక్షలు, ఆపై విలువ కలిగిన హ్యాండ్‌బ్యాగులు, చేతి గడియారాలు, పాదరక్షలు, స్పోర్ట్స్‌వేర్ తదితర లగ్జరీ వస్తూత్పత్తుల కొనుగోళ్లపై ఇక నుంచి 1 శాతం ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్ (టీసీఎస్) వర్తిస్తుందని ఆదాయ పన్ను (ఐటీ) శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు తాజాగా ఓ నోటిఫికేషన్‌ను ఐటీ శాఖ విడుదల చేసింది. ప్రస్తుతం రూ.10 లక్షలు, ఆపై విలువైన మోటర్ వాహనాలపై 1 శాతం టీసీఎస్ పడుతున్నది. ఈ ఏడాది జనవరి 1 నుంచే ఇది అమల్లోకి వచ్చింది. గత ఏడాది జూలైలో ప్రకటించిన బడ్జెట్‌లో భాగంగా వచ్చిన ఆర్థిక చట్టం-2024 ద్వారానే దీన్ని పరిచయం చేశారు. ఈ క్రమంలో ఇకపై మరికొన్ని ఖరీదైన ఐటెమ్స్ పైనా సదరు టీసీఎస్ ఉంటుందంటున్నాయి ఐటీ శాఖ వర్గాలు.

టీసీఎస్ అంటే?

ఏదైనా వస్తూత్పత్తిని అమ్మినప్పుడు దానికి సంబంధించిన చెల్లింపులు (బిల్ పేమెంట్) జరిగే సమయంలోనే కొనుగోలుదారుడి నుంచి అమ్మేవారు వసూలు చేసే ట్యాక్స్‌నే టీసీఎస్ అంటారు. అయితే కొన్నవారు ఈ పన్ను మొత్తాన్ని తమ ఐటీ రిటర్నులను దాఖలు చేసేటప్పుడు క్లెయిం చేసుకోవచ్చు. కాగా, అదనపు ఆదాయాన్ని ఆర్జించాలనే లక్ష్యంతో ఈ టీసీఎస్‌ను విధించట్లేదని, లగ్జరీ వస్తూత్పత్తులను కొనేటప్పుడు కొనుగోలుదారుడు సమర్పించే పాన్ (పర్మనెంట్ అకౌంట్ నెంబర్) వివరాలనుబట్టి ఈ లావాదేవీలను ఐటీ శాఖ గుర్తించడానికి టీసీఎస్ ఉపయోగపడుతుందని ట్యాక్స్ ఎక్స్‌పర్ట్స్ పేర్కొంటున్నారు. దీనివల్ల ఆర్థిక పారదర్శకతకు వీలుంటుందని చెప్తున్నారు.

1% టీసీఎస్ వర్తించే వస్తూత్పత్తులివే..

- హ్యాండ్‌బ్యాగులు
- చేతి గడియారాలు, పాదరక్షలు
- పెయింటింగ్స్, శిల్పాలు తదితర కళాకృతులు
- పురాతన వస్తువులు, సన్‌గ్లాసులు
- సేకరించే నాణేలు, స్టాంపుల వంటివి
- పడవలు, హెలీక్యాప్టర్లు
- స్పోర్ట్స్‌వేర్, వాటి ఉపకరణాలు
- హోమ్ థియేటర్ సిస్టమ్స్
- రేసింగ్ లేదా పోలో కోసం ఉద్దేశించిన గుర్రాలు

7 రోజులు.. రూ.37 లక్షల కోట్లు

- **స్టాక్ మార్కెట్లలో వరుస లాభాలతో పెరిగిన మదుపరుల సంపద**
- **మళ్లీ 80వేల మార్కుకు సెన్సెక్స్**

ముంబై, ఏప్రిల్ 23: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాలతో దూసుకెళ్తున్నాయి. ఏడు రోజులుగా సూచీలు పరుగులు పెడుతుండటంతో మదుపరుల సంపద కూడా అదే స్థాయిలో పెరుగుతూపోయింది. ఈ క్రమంలోనే బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.36,65,542.83 కోట్లు పుంజుకుని రూ.4,30,47,876.05 కోట్లకు చేరింది. ఈ ఏడు రోజుల్లో బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 6,269.34 పాయింట్లు లేదా 8.48 శాతం ఎగబాకింది. అలాగే బుధవారం మళ్లీ 80వేల మార్కును కూడా దాటేసింది. ఈ ఒక్కరోజే 520.90 పాయింట్లు లేదా 0.65 శాతం పెరిగి 80,116.49 వద్ద సెన్సెక్స్ స్థిరపడింది. గత ఏడాది డిసెంబర్ 18 తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి. ఇక ఒకానొక దశలో 80,254.55 వద్దకు చేరింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 161.70 పాయింట్లు లేదా 0.67 శాతం అందిపుచ్చుకొని 24,328.95 వద్ద ముగిసింది.

మెరిసిన ఐటీ షేర్లు

ఐటీ, ఆటో షేర్లు మదుపరులను అమితంగా ఆకర్షించాయి. 4.25 శాతం, 2.34 శాతం చొప్పున పెరిగాయి. అలాగే విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) పెట్టుబడులు, కలిసొచ్చిన అంతర్జాతీయ పరిణామాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చాయని ట్రేడింగ్ సరళిని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇక సెన్సెక్స్ సంస్థల్లో హెచ్‌సీఎల్ టెక్ షేర్ విలువ అత్యధికంగా 7.72 శాతం లాభపడింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) చివరి త్రైమాసికమైన జనవరి-మార్చిలో కంపెనీ ఏకీకృత నికర లాభం 8.1 శాతం వృద్ధిచెంది రూ.4,307 కోట్లుగా నమోదైంది. ఇది ఇన్వెస్టర్లను ఆకట్టుకున్నది. టెక్ మహీంద్రా, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ సుజుకీ షేర్లూ మెప్పించాయి. రియల్టీ, హెల్త్‌కేర్ షేర్లూ పరుగులు పెట్టాయి.

పసిడి ధరలు తిరోగమనం

- **రూ.2,400 తగ్గిన తులం ధర**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: గత కొన్ని రోజులుగా రాకెట్ వేగంతో దూసుకుపోయిన బంగారం ధరలు ఎట్టకేలకు శాంతించాయి. లక్ష రూపాయలు అధిగమించిన తులం పుత్తడి ధర యూ టర్న్ తీసుకున్నది. అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తత పరిస్థితులు తగ్గుముఖం పట్టడంతో ఒక్కసారిగా ధరలు దిగొచ్చాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం పుత్తడి ధర రూ.99,200కి దిగొచ్చింది. అంతకుముందు ఉన్న రూ.1,01,600తో పోలిస్తే రూ.2,400 తగ్గినట్టు అయింది. ఈ విషయాన్ని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. రికార్డు స్థాయికి చేరుకున్న బంగారం ధరలు కరెక్షన్ గురయ్యాయని, చైనా ఉత్పత్తులపై విధించిన సుంకాలు త్వరలో గణనీయంగా తగ్గుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు పుత్తడి ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. ప్రతీకార సుంకాల విధింపుపై ఆందోళనలు తగ్గుముఖం పడితే బంగారం ధర రూ.94-98 వేల మధ్యలో నమోదుకావచ్చునని చెప్పారు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో జూన్ నెల డెలివరీకిగాను బంగారం ధర రూ.1,435 తగ్గి రూ.95,905గా నమోదైంది.

పెరిగిన వెండి ధరలు

ఒకవైపు బంగారం ధరలు తగ్గుముఖం పట్టగా..మరోవైపు వెండి ధరలు పెరిగాయి. కిలో వెండి రూ.700 అధికమై రూ.99,200 పలికింది. అంతకుముందు ఇది రూ.98,500గా ఉన్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో వెండి ధరలు పెరిగాయని బులియన్ ట్రేడర్ వెల్లడించారు. మరోవైపు, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 50 డాలర్లు తగ్గి 3,330.99 డాలర్లకు పరిమితం కాగా, వెండి 32.90 డాలర్లకు చేరుకున్నది.

గోల్డ్‌కు తగ్గనున్న డిమాండ్: క్రిసిల్

రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న ధరల కారణంగా సమీప భవిష్యత్తులో బంగారానికి డిమాండ్ పడిపోయే ప్రమాదం ఉన్నదని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ అంచనావేస్తున్నది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ విక్రయాలు 9 శాతం నుంచి 11 శాతం లోపు పడిపోవచ్చునని పేర్కొంది. గడిచిన నాలుగేండ్లుగా ఆభరణాల పరిశ్రమ 20 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేసుకుంటున్నదని, దీంతో 2021 నుంచి ఇప్పటి వరకు ఇండస్ట్రీ రెండున్నరరెట్లు అధికమైందన్నారు. రికార్డు స్థాయికి చేరుకున్న ధరలతో వచ్చే అక్షయ తృతీయ రోజు అమ్మకాలు గణనీయంగా పడిపోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించింది. దీంతో రిటైలర్లు అమ్మకాలను పెంచుకోవడానికి ప్రమోషన్లు, డిస్కౌంట్లు ప్రకటించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

పీఎన్‌బీ రిటైల్ లోన్లలో ప్రాసెసింగ్ ఫీజు ఎత్తివేత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: ప్రభుత్వరంగ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)..ప్రత్యేకంగా రిటైల్ రుణ మేళా 'పీఎన్‌బీ నిర్మాన్ 2025'ను నిర్వహిస్తున్నట్టు ప్రకటించింది. జూన్ 20 వరకు అందుబాటులో ఉండనున్న ఈ స్కీం కింద గృహ, వాహన రుణాలపై ప్రాసెసింగ్ ఫీజును పూర్తిగా ఎత్తివేసిన బ్యాంక్...అలాగే డాక్యుమెంటేషన్ చార్జీలను మినహాయింపునిచ్చింది. దీంతోపాటు గృహ రుణాలపై ఎన్ఈసీ, లీగల్, వాల్యుయేషన్ ఫీజులపై రాయితీ ఇచ్చింది. అదనపు ప్రయోజనాలు కల్పించడంలో భాగంగా వాహన, గృహ, విద్యా రుణాలపై వడ్డీరేటుపై 5 బేసిస్ పాయింట్లు రాయితీ ఇస్తున్నది కూడా.

ప్రీమియం వసూళ్లలో బీమా సంస్థల జోరు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: జీవిత బీమా సంస్థలు నూతన బిజినెస్ ప్రీమియం వసూళ్లలో భారీ వృద్ధి నమోదైంది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికిగాను నూతన ప్రీమియం వసూళ్లు 5.1 శాతం ఎగబాకి రూ.3.97 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అంతక్రితం ఏడాది ఇది రూ.3.77 లక్షల కోట్లుగా ఉన్నాయి. దీంట్లో వ్యక్తిగత నూతన బిజినెస్ ప్రీమియం వసూళ్లు రూ.1.49 లక్షల కోట్ల నుంచి రూ.1.66 లక్షల కోట్లకు చేరుకున్నాయి. బీమా సంస్థల్లో అగ్రగామి లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) రూ.2.26 లక్షల కోట్ల నూతన బిజినెస్ ప్రీమియాన్ని వసూలు చేసింది. దీంట్లో రూ.62,404.58 కోట్లు వ్యక్తిగత నూతన బిజినెస్ ప్రీమియం వసూళ్లు కావడం విశేషం. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ 1.78 కోట్ల నూతన పాలసీలను విక్రయించింది.

మెయిల్‌కు 13 వేల కోట్ల ఆర్డర్

హైదరాబాద్, ఏప్రిల్ 23: రాష్ట్రానికి చెందిన మెఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్(మెయిల్) మరో భారీ ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్) నుంచి రూ.13 వేల కోట్ల విలువైన ఆర్డర్ లభించినట్టు పేర్కొంది. ఈ ఆర్డర్‌లో భాగంగా కర్ణాటక రాష్ట్రంలో కైగా వద్ద 700 మెగావాట్స్ ఎలక్ట్రిక్ సామర్థ్యం కలిగిన రెండు అణు రియాక్టర్ల నిర్మాణ ప్రాజెక్టునకు సంబంధించి పర్చేజ్ ఆర్డర్ అందుకున్నట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించి బుధవారం ఇరు కంపెనీల ఉన్నతాధికారులు సంతకాలు చేశారు. ఎన్‌పీసీఐఎల్ చరిత్రలో ఏకమొత్తంగా ఇచ్చిన అతిపెద్ద ఆర్డర్ ఇదే కావడం విశేషం.

గోద్రెజ్ స్మార్ట్ సెక్యూరిటీ పరికరాలు



హైదరాబాద్, ఏప్రిల్ 23: సెక్యూరిటీ సొల్యూషన్స్ పరికరాల సంస్థ గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూపు.. తాజాగా స్మార్ట్ సెక్యూరిటీ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. భద్రతాపరంగా పెరుగుతున్న సవాళ్లను అధిగమించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ నూతన శ్రేణి పరికరాలు వ్యక్తిగత వినియోగదారులతోపాటు సంస్థాగత అవసరాల కోసం వినియోగించుకోవచ్చునని కంపెనీ బిజినెస్ హెడ్ పుష్కర్ గోఖలే తెలిపారు.

అంతరిక్షంలో ఆహారం ఉత్పత్తి

భూ కక్ష్యలోకి బయో రియాక్టర్‌ను పంపిన ఈఎస్ఏ

లండన్, ఏప్రిల్ 23: అంతరిక్షంలో ఆహారాన్ని పండించటంపై ప్రపంచవ్యాప్తంగా సైంటిస్టులు అనేక ప్రయోగాలు చేస్తున్నారు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ) తాజాగా ఓ విప్లవాత్మక ప్రాజెక్ట్‌ను చేపట్టింది. ల్యాబ్‌లో ఆహార తయారీకి వినియోగించే బయో-రియాక్టర్‌కు సంబంధించి కాంపాక్ట్ వెర్షన్‌ను ఈఎస్ఏ పరిశోధకులు బృందం మంగళవారం అంతరిక్షంలోకి పంపింది. ఈ మిషన్ సక్సెస్ అయితే, వచ్చే ఏడాది అంతరిక్షంలోకి పెద్ద ఎత్తున బయో రియాక్టర్లను ప్రవేశపెట్టడానికి మార్గం సుగమం అవుతుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం వద్ద ఆహార ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఇది తొలి అడుగుగా ఈఎస్ఏ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతరిక్షంలో ప్రస్తుతం ఒక వ్యోమగామికి ఒక రోజు ఆహారానికి అయ్యే ఖర్చు అక్షరాలా రూ.23 లక్షలు. మానవుడు అంతరిక్షంలోనే ఆహారాన్ని ఉత్పత్తి చేసుకోగలిగితే, అంతరిక్ష యాత్రల్లో విప్లవాత్మక మార్పులకు దారితీస్తుందని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

సూర్యుడ్ని మసకబార్చి!

- **భూతాపాన్ని అరికట్టే యత్నం**
- **ప్రయోగాలకు త్వరలో బ్రిటన్ ఓకే**

లండన్: భగభగలాడే ఎండలో ఏదైనా పనిమీద ఇంటి నుంచి బయటకు వెళ్లడం ఎవరికైనా ఇబ్బందికరమే. కానీ, సమీప భవిష్యత్తులో అదేమీ ఇబ్బందికరం కాకపోవచ్చు. ఎండు కంటే భూతాపాన్ని (గ్లోబల్ వార్మింగ్‌ను) అరికట్టేందుకు సూర్యుడిని మసకబార్చాలని నిపుణులు భావిస్తున్నారు. అందుకోసం ప్రయోగాలు చేపట్టాలని యోచిస్తున్నారు. భూమి పైనుంచి సూర్యరశ్మిని ప్రతిబింబించే ఈ ప్రయోగాలకు బ్రిటన్ ప్రభుత్వం త్వరలో అనుమతి ఇవ్వబోతున్నట్టు 'టెలిగ్రాఫ్' పత్రిక వెల్లడించింది. ఏరోసోల్స్‌ను ఇంజెక్ట్ చేయడం, సూర్యరశ్మిని ప్రతిబింబించేందుకు మేఘాలను ప్రకాశవంతం చేయడం లాంటి అవుట్‌డోర్ ప్రాజెక్టులు, పరీక్షలను చేపట్టబోతున్నట్టు బ్రిటన్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని అడ్వాన్స్‌డ్ రిసెర్చ్ అండ్ ఇన్వెన్షన్ ఏజెన్సీ (ఏఆర్ఐఏ) ప్రోగ్రామ్ డైరెక్టర్ ప్రొఫెసర్ మార్క్ సైమెస్ వెల్లడించారు. మరికొద్ది వారాల్లో ప్రకటించనున్న ఈ ప్రాజెక్టుల కోసం ఏఆర్ఐఏ 50 మిలియన్ల పౌండ్లను కేటాయించింది.

అటు ఉష్ణం.. ఇటు శీతలం!

- **భూతాపంతో ఉష్ణోగ్రతల్లో ఆకస్మిక మార్పులు**
- **ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావం**
- **భవిష్యత్తులో మరింత తీవ్రతరం**

ఢిల్లీ : వాతావరణంలో మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతల్లో ఆకస్మిక మార్పులు (టెంపరేచర్ ఫ్లిప్స్) చోటుచేసుకుంటున్నట్టు శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూతాపం వల్ల ఒక్కసారిగా అత్యంత వేడి నుంచి శీతలం.. శీతలం నుంచి అత్యంత వేడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు పరిశోధకులు చెబుతున్నారు. ఇలాంటి పరిణామాలు మానవులకు, వాతావరణానికి తీవ్ర ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానవ ప్రేరేపిత వాతావరణ మార్పుల వల్ల 1961 నుంచి ప్రపంచవ్యాప్తంగా 60 శాతం ప్రాంతాలు దీని ప్రభావానికి లోనయ్యాయని, ఇలాంటి ఆకస్మిక ఉష్ణోగ్రతల మార్పులు సర్వసాధారణమయ్యాయని, తీవ్రంగా, వేగంగా సంభవిస్తున్నాయని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ మేరకు 'నేచర్ కమ్యూనికేషన్స్'లో అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి.

కర్బన ఉద్గారాలు తగ్గకపోతే...

2012 మార్చిలో ఉత్తర అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఆకస్మికంగా -10 డిగ్రీల సెల్సియస్ నుంచి 5 డిగ్రీల సెల్సియస్ మధ్యలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. 2020 సెప్టెంబర్‌లో రాకీ పర్వతాల్లో ఒక్కరోజు వ్యవధిలో 20 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు పడిపోయినట్టు అధ్యయనంలో వెల్లడైంది. ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోయి, తీవ్రంగా మంచు కురిసినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఆకస్మికంగా మార్పులకు లోనయ్యే ప్రమాదముందని వారు చెబుతున్నారు. కర్బన ఉద్గారాల వాడకం తగ్గకపోతే ఈ శతాబ్దం చివరి నాటికి ప్రమాదపుటంచుల్లో ఉన్నవారి శాతం 100కు చేరుతుందని హెచ్చరిస్తున్నారు.

ఆస్ట్రేలియాలో వీసా నిబంధనలు కఠినతరం

- **భారత్‌లోని 6 రాష్ట్రాల విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ తాత్కాలికంగా నిలిపివేత**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: విద్యార్థి వీసా నిబంధనలను ఆస్ట్రేలియా కఠినతరం చేసింది. తద్వారా అంతర్జాతీయ విద్యా మార్గాలపై కఠిన ఆంక్షలు విధిస్తున్న అమెరికా, కెనడా సరసన ఆస్ట్రేలియా కూడా చేరింది. ఆస్ట్రేలియాలోని ఫెడరేషన్ యూనివర్సిటీ, వెస్టన్ సిడ్నీ యూనివర్సిటీ, విక్టోరియా యూనివర్సిటీ, సదరన్ క్రాస్ యూనివర్సిటీ సహా పలు విశ్వవిద్యాలయాలు భారత్‌లోని పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్, జమ్మూకశ్మీర్ రాష్ట్రాల విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణను తాత్కాలికంగా నిలిపివేశాయి. విద్యార్థి వీసా వ్యవస్థ దుర్వినియోగాన్ని అరికట్టాలన్న లక్ష్యంతో ఆస్ట్రేలియా ప్రభుత్వం చేపట్టిన కఠిన చర్యల్లో భాగంగా ఈ ఆంక్షలు విధించారు. ఈ పరిణామం భారత్‌లోని, ముఖ్యంగా గుజరాత్‌లోని వీసా కన్సల్టెంట్లు, విద్యార్థుల్లో అశాంతిని సృష్టించింది. ఉన్నత విద్య కోసం గుజరాత్ విద్యార్థులు ఆస్ట్రేలియాను అత్యున్నత గమ్యస్థానంగా పరిగణిస్తుండటమే ఇందుకు కారణం. విదేశాల్లో చదువుకోవాలనుకునే గుజరాత్ విద్యార్థుల్లో దాదాపు 20% మంది ఆస్ట్రేలియాను ఎంచుకుంటున్నట్టు ఎడ్యుకేషన్ కన్సల్టెంట్లు చెప్తున్నారు. కానీ, ఇప్పుడు ఆస్ట్రేలియా కొత్త ఆంక్షలు విధించడం వల్ల ఇకపై గుజరాత్ నుంచి ఆ దేశానికి వెళ్లాలనుకునే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గవచ్చని వారు అంచనా వేస్తున్నారు.

మరాఠ్వాడాలో రైతుల మృత్యుఘోష

- **3 నెలల్లో 269 మంది ఆత్మహత్య**
- **మహాయుతి సర్కారు రుణ మాఫీపై మోసం చేసిందని అన్నదాతల ఆగ్రహం**

ఛత్రపతి శంభాజీ నగర్: బీజేపీ పాలిత మహారాష్ట్రలో రైతుల ఆత్మహత్యలు ఆగడం లేదు. ముఖ్యంగా మరాఠ్వాడా ప్రాంతంలో అన్నదాతల ఆత్మహత్యలు ఏటికేడు పెరుగుతున్నాయి. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో ఈ ప్రాంతంలో 269 మంది అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారు. నిరుడు మొదటి మూడు నెలల్లో ఈ సంఖ్య 204గా ఉంది. తక్కువ వర్షపాతం, రుతు పవన వైవిధ్యం వల్ల నీటి కొరత కలిగిన మరాఠ్వాడాను పాక్షిక శుష్క ప్రాంతంగా పరిగణిస్తారు. మాజీ ఎంపీ, షేత్కారీ(రైతు) సంఘటన అధ్యక్షుడు రాజు షెట్టి మాట్లాడుతూ.. మహాయుతి సర్కారు నిరుడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన రైతు రుణ మాఫీ హామీని అమలు చేయకపోవడం రైతుల బలవన్మరణాలకు ఒక కారణమన్నారు. 'ఇది రైతులను మోసం చేయడమే. రుణ మాఫీ కాకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు ప్రాణాలు తీసుకుంటున్నారు' అని షెట్టి అన్నారు. సగటున ఒక హెక్టార్‌కు వచ్చే పత్తి, సోయాబీన్ దిగుబడి శాతం తగ్గిపోయిందని.. మరోవైపు సాగు ఖర్చులు పెరిగిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత సీజన్‌లో రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువగా క్వింటాల్ సోయాబీన్‌ను రూ.1200 అమ్ముకోవాల్సి వచ్చిందని.. రైతులందరికీ రూ.8,500 కోట్ల నష్టం వచ్చిందని ఆయన వెల్లడించారు.

డబుల్ ట్రబుల్ | ఇంజిన్

నాగపూర్, నాసిక్‌లలో నీటికోసం మహిళల అవస్థలు

మహారాష్ట్రలో నీటి కటకట!

- **బీజేపీ పాలిత రాష్ట్రంలో ప్రజల అవస్థలు**

నాసిక్: బీజేపీ పాలిత మహారాష్ట్రలో చాలా జిల్లాలు తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా నాసిక్ సహా విదర్భలోని పలు జిల్లాల్లో చాలా గ్రామాలు ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి. వేసవి ఇంకా విజృంభించక ముందే రాష్ట్రంలో చాలాచోట్ల నీటి వనరులు అడుగంటి పోయాయి. దీంతో మహిళలు మూడు, నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి ఇండ్లకు నీళ్లను మోసుకు రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నాసిక్ జిల్లా బొరిచివరి గ్రామ మహిళలైతే గుక్కెడు నీళ్ల కోసం ఎండిపోయిన బావిలోకి ప్రమాదకరంగా తాడు సాయంతో దిగుతున్నారు. నీళ్ల కోసం పోరాటం తమకు నిత్య కృత్యమైందని వారు వాపోతున్నారు. అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యావత్మల్‌లోని పార్థీ తెగ మహిళలూ ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు రాష్ట్రంలో తాగునీటి సమస్యపై విపక్ష కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడింది. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీరు అందిస్తామన్న మోదీ ప్రభుత్వం మాటలు పోస్టర్లకే పరిమితయ్యాయని విమర్శించింది.

తుపాకీ గురిపెట్టి దళిత మహిళపై రేప్

- **కుమారుడి ఎదుటే దారుణం**
- **ఉత్తరప్రదేశ్‌లో ఘటన**

లక్నో, ఏప్రిల్ 23: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో మరో దారుణం చోటు చేసుకున్నది. తుపాకీ గురిపెట్టి.. ఓ దళిత మహిళపై లైంగికదాడికి పాల్పడ్డాడు. నాలుగేండ్ల కుమారుడి ఎదుటే బాధిత మహిళపై నిందితుడు ఈ దారుణానికి ఒడిగట్టాడు. మెయిన్‌పురి జిల్లాలో ఈ అమానవీయ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దళిత మహిళ భర్త తీవ్రమైన ఆర్థిక సమస్యల్లో ఉండటాన్ని నిందితుడు ఆసరాగా చేసుకొని, ఆమెకు రూ.20వేలు రుణంగా ఇస్తానని నమ్మబలికాడు. వంతెన వద్ద తన కుమారుడితో నిలుచున్న ఆమెను మోటార్ బైక్‌పై నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి.. అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎదురు తిరిగితే తుపాకీతో ఇద్దర్నీ కాల్చిపారేస్తానని బెదిరించాడు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతోపాటు, బీఎన్ఎస్ సెక్షన్ కింద నిందితుడిపై కేసు నమోదైంది.

పొమ్మనకుండా పొగ!

- **వీసా రెన్యువల్‌లో కెనడా జాప్యం**
- **వర్క్ పర్మిట్లు కోల్పోతున్న భారతీయులు**

ఒట్టావా: కెనడాలో నివసిస్తున్న భారతీయులు సహా పలువురు విదేశీ వలసదారులను దేశం నుంచి పంపించేసేందుకు ఆ దేశ ప్రభుత్వ కొత్త ఎత్తుగడలు వేస్తున్నది. వారికి పొమ్మనకుండా పొగబెడుతున్నది. వీసా పునరుద్ధరణలో తీవ్ర జాప్యం కారణంగా వలసదారులు వర్క్ పర్మిట్లను కోల్పోతున్నారు. పైగా వారి చట్టబద్ధమైన హోదాను కొనసాగించే ప్రయత్నాలకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. వలసవాదులు పన్ను చెల్లిస్తున్నప్పటికీ, వారు చట్టబద్ధమైన స్థితిని కనుక పొందకపోతే వారు అధికారికంగా అక్కడ పనిచేయలేరు. అలాగే వైద్య సహాయం, ఇతర సౌకర్యాలు కోల్పోతారు. కెనడాకు వస్తున్న వలసదారుల కారణంగా ఇళ్ల సమస్యతో పాటు, ఇళ్ల అద్దెలు పెరిగిపోతుండటంతో